సాక్షి
విశాఖపట్నం

ఆదివారం । 12 । నవంబర్ । 2023

న్యూస్‌రీల్

నేడు సింహగిరిపై నరకాసురవధ



నరకాసురుడి విగ్రహం

సింహాచలం: నరక చతుర్దశి, దీపావళి పురస్కరించుకుని ఆదివారం సింహగిరిపై నరకాసురవధ ఉత్సవం ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం వైదిక, అధికారులు ఏర్పాట్లు చేశారు. రాత్రి ఆరాధన అనంతరం ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. నరకాసురుడి విగ్రహాన్ని ఓ పల్లకీలో, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను మరొక పల్లకీలో అధిష్ఠింపజేసి.. సింహగిరి మాడవీధిలో ఎదురెదురుగా ఉంచి నరకాసుర వధ ఉత్సవం నిర్వహిస్తారు. యుద్ధ సన్నివేశాలు, నరకాసురవధ ఘట్ట విన్నపం, పూజలు జరుపుతారు. పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తారు. ఈ సందర్భంగా నేటి సాయంత్రం 6 గంటల వరకే స్వామి దర్శనాలు భక్తులకు లభిస్తాయని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాస మూర్తి వెల్లడించారు.

శ్రీవారి సన్నిధిలో లడ్డూల విక్రయాలు



లడ్డూల విక్రయాలను పర్యవేక్షిస్తున్న ఏఈవో జగన్‌మోహనాచార్యులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం లడ్డూలను విక్రయించారు. ఆలయంలో కౌంటర్ల వద్ద 750 గ్రాముల కల్యాణ లడ్డూ రూ.200, 140 నుంచి 170 గ్రాములు బరువు ఉన్న సాధారణ లడ్డూ రూ.50కు విక్రయించినట్లు ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. కాగా.. అధిక సంఖ్యలో భక్తులు వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థానం తగిన ఏర్పాట్లు చేసింది.

కానిస్టేబుల్ పరవాడ కృష్ణకు దివీస్ ఆర్థిక సాయం



కానిస్టేబుల్ కృష్ణకు సైకిల్‌ను అందిస్తున్న సీపీ డాక్టర్ ఎ.రవిశంకర్

దొండపర్తి: ఐరన్ మ్యాన్ పోటీలో పాల్గొంటున్న నగర పోలీసు శాఖకు చెందిన పరవాడ కృష్ణకు దివీస్ సంస్థ రూ.6.75 లక్షలు ఆర్థిక సాయం అందించింది. రూ.3.75 లక్షలు విలువ చేసే అత్యాధునిక సైకిల్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ చేతుల మీదుగా అందజేశారు. పరవాడ కృష్ణ ఐరన్ మ్యాన్ ట్రయథ్లాన్ (పరుగు, ఈత, సైక్లింగ్)లో ఇప్పటికే రెండు సార్లు దేశం తరుపున పోటీలో పాల్గొని విజేతగా నిలిచాడు. వచ్చే నెల 3వ తేదీన ఆస్ట్రేలియాలోని బాసిల్టన్ నగరంలో జరగనున్న పోటీలో పాల్గొంటున్న సందర్భంగా అందుకు అవసరమైన ఆర్థిక సహాయం రూ.6.75 లక్షలు దివీస్ సంస్థ అందిస్తోంది.

దీంతో సీపీ రవిశంకర్ దివీస్ సంస్థ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో పాల్గొంటున్న కృష్ణకు పోలీస్ శాఖ తరపున కూడా తగిన సహకారం అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో దివీస్ జనరల్ మేనేజర్ వై.ఎస్.కోటేశ్వరరావు, లైజన్ కన్సల్టెంట్ వరహాల రెడ్డి, సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్ కుమార్, ఏసీపీ-2(ఏఆర్) ఎ.రాఘవేంద్రరావు గారు తదితరులు పాల్గొన్నారు.



ఏయూ మైదానంలో బాణసంచా విక్రయాలు

జగమంత వెలుగు

దీపావళి అంటేనే వెలుగుల పండగ. అమావాస్య చీకట్లను చీల్చుతూ ఎటుచూసినా దీపాల సొబగులే. అంబరాన్నంటే సంబరాలే. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా హిందువులంతా ఎంతో ఆనందోత్సాహాలతో చేసుకునే పండగతో ప్రతీ ఇల్లు కళకళలాడుతుంది. అయితే ఆ ప్రమోదం వెనకే ప్రమాదం పొంచి ఉందన్న విషయం గుర్తెరగరు. బాణసంచా కాల్చేటప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యం చూపినా పెను ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది. అవి మిగిల్చిన చేదు జ్ఞాపకాలు జీవితాంతం వెంటాడుతూనే ఉంటాయి. – దాబాగార్డెన్స్

- ప్రమోదం.. కాకూడదు ప్రమాదం
- కాలుష్యం నుంచి మాస్క్‌లతో రక్ష
- వెలుగుల పండక్కి నగరం సిద్ధం

దీపావళి పండగను జరుపుకునేందుకు నగరం సిద్ధమైంది. దీపావళి అంటే ప్రతీ మదిలో మెదిలేది టపాసులు.. క్రాకర్స్.. చిచ్చుబుడ్డి వెలుగులు. గతంలో పిండి వంటలు చేసుకుని.. మట్టి దీపాలతో దివిటీలు తిప్పుడూ పండగ జరుపుకునేవారు. ఇవి ప్రకృతికి పెద్దగా నష్టం కలిగించేవి కాదు. నేటి మన జీవన విధానం.. పండగ చేసుకునే తీరు ప్రకృతి వనరులు, చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధిగ్రస్తులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నో జాగ్రత్తలతో పండగ జరుపుకోవాల్సిన అవసరం ఏర్పడింది. వాయు కాలుష్యం హృదయ, శ్వాసకోశ వ్యాధులను తీవ్రతరం చేస్తుంది. గుండె, ఊపిరితిత్తులపై ప్రభావితం చూపుతుంది. గుండెపోటుకు దారి తీసే అవకాశం ఉంది. అందుకే ముందు జాగ్రత్తగా దీపావళి రోజు మాస్క్‌లు ధరించి టపాసులు కాల్చాలని వైద్యులు సూచిస్తున్నారు. పర్యావరణ కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకున్న కొన్ని సంస్థలు యాంటీ పొల్యూషన్ మాస్క్‌లను విరివిగా విక్రయిస్తున్నాయి. బాణసంచా దుకాణాల్లో ఇవి లభిస్తున్నాయి.

అత్యవసర నంబర్లు

108: అగ్నిప్రమాదంలో ఎవరైనా గాయపడితే వెంటనే 108కు ఫోన్ చేయాలి. ప్రమాదం ఎక్కడ జరిగిందో లొకేషన్ వివరాలు స్పష్టంగా తెలియజేయాలి.

101: అగ్ని ప్రమాదం జరిగితే అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం అందించాలి.

100: అత్యవసర సమాచారం ఏదైనా డయల్ 100కు ఫోన్ చేసి తెలియజేయాలి.

నగర ప్రజలకు శుభాకాంక్షలు



మహా విశాఖ నగర ప్రజలందరూ హరిత దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు. ప్రతి ఇంటా ఆనందాల హరివిల్లుగా, మట్టి ప్రమిదల దీపాలు, పువ్వులు, సౌర విద్యుత్ దీపాలతో స్వచ్ఛ దీపావళి-శుభ దీపావళి జరుపుకోవాలని ఆకాంక్షించారు. పర్యావరణ హితమైన వస్తువులతో పండగ చేసుకోవాలని సూచిస్తూ.. దీపావళి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

టపాసులు కాల్చేటప్పుడు..

- వినియోగదారులు నాణ్యమైన టపాసులు మాత్రమే కొనుగోలు చేయాలి.
- పైకి ఎగిరే తారాజువ్వలను గడ్డికుప్పలు, పూరి గుడిసెలకు దూరంగా కాల్చాలి.
- కాల్చేటప్పుడు చెప్పులు,బూట్లు ధరించాలి.
- పెద్దల పర్యవేక్షణలో పిల్లలు బాణసంచా కాల్చడం ఉత్తమం.
- సరిగ్గా కాలని వాటిని మళ్లీ వెలిగించడం, ఊదడం చేయకూడదు.
- తక్కువ శబ్దం వచ్చే వాటిని ఎంచుకోవాలి.
- పేలుడు పదార్థాలను పిల్లలకు దూరంగా ఉంచాలి.
- కాల్చేటప్పుడు నీటిని అందుబాటులో ఉంచుకోవాలి.
- చేతిలో టపాసులు కాల్చడం, వెలిగించి విసిరి వేయడం వంటివి చేయకూడదు.

అగ్నిమాపక కేంద్రాల నంబర్లు

సూర్యాబాగ్, సిటీ	0891-2563582
బర్మాక్యాంపు, సిటీ	0891-2558470
పెదగంట్యాడ	0891-2517780
చిట్టివలస	08933-201337
అనకాపల్లి	08924-222299
యలమంచిలి	0891-231101
సబ్బవరం	08924-248799
నర్సీపట్నం	08932-235101
చోడవరం	08934-245199
మాడుగుల	08934-224211
పాడేరు	08935-250201
నక్కపల్లి	08931-227901
రావికమతం	08934-226111



మార్కెట్‌కు జోష్

జగదాంబ: నగరంలో శనివారం దీపావళి సందడి నెలకొంది. పూజ, అలంకరణ వస్తువులు, టపాసులు, నూతన వస్త్రాల కొనుగోళ్లతో వ్యాపార సంస్థలన్నీ కళకళలాడాయి. పూర్ణామార్కెట్ సందడిగా మారింది. వినియోగదారులు వారికి కావాల్సిన పూజా సామగ్రితోపాటు ఇతర వస్తువులు కొనుగోలుకు మార్కెట్‌కు తరలివచ్చారు. ప్రమిదలు, పూజా సామగ్రి, పువ్వులు, చెరుకులు, కలకూరలు, పత్రుల దుకాణాలు అధికంగా వెలిశాయి. పువ్వులు, పత్రులను అధిక ధరకు విక్రయించారు. వివిధ ఆకృతుల ప్రమిదలు ఆకట్టుకున్నాయి. లక్ష్మీ పూజలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేశారు. ఏయూ, ఏఎస్ రాజా మైదానాలతో పాటు పలు చోట్ల బాణసంచా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. టపాసులను కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో రావడంతో ఆయా చోట్ల సందడి నెలకొంది. రైతుబజార్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఇలా మార్కెట్‌లో ఎక్కడ చూసినా దీపావళి శోభ కనిపించింది.



పువ్వుల విక్రయ దుకాణాల వద్ద సందడి



ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు



చెరుకు గెడలు విక్రయిస్తున్న వ్యాపారులు

• జీవీఎంసీ పరిధిలో 442 దుకాణాలు



ఏయూ మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణం వద్ద బాణసంచా కొనుగోలు చేస్తున్న నగర ప్రజలు

దాబాగార్డెన్స్: దీపావళి పండగ పురస్కరించుకుని జీవీఎంసీ పరిధిలో 442 దుకాణాలకు అనుమతులిచ్చినట్టు అగ్నిమాపక అధికారి హనుమంతరావు తెలిపారు. ఏయూ గ్రౌండ్ పరిధిలో మూడు ప్రాంతాల్లో 133, ఎంవీపీకాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో 50, అనకాపల్లి ఎన్టీఆర్ మైదానంలో 40, గాజువాక ఆదర్శ్ మైదానంలో 50, మల్కాపురం మైదానంలో 29 దుకాణాలకు అనుమతులిచ్చినట్లు వివరించారు. మిగిలిన 140 దుకాణాలను జీవీఎంసీ పరిధిలోని ఖాళీగా ఉన్న వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుకు అనుమతి ఇచ్చామన్నారు. అందిన దరఖాస్తుల్లో 46.. నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో తిరస్కరించినట్లు వెల్లడించారు.


హెల్త్ సిటీలో కామన్ ల్యాబ్!

- ఆ ప్రాంత ఆస్పత్రుల కోసం ఏర్పాటు
- రూ.10 కోట్ల అంచనా వ్యయం
- ఈ తరహా లేబొరేటరీ రాష్ట్రంలో ఇదే ప్రథమం
- అక్కడే ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు కూడా..

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం హెల్త్ సిటీలో సరికొత్తగా కామన్ లేబొరేటరీ ఏర్పాటు కానుంది. ఆ ప్రాంతంలో ఉన్న వివిధ కార్పొరేట్ ఆస్పత్రుల అవసరాల కోసం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో ఈ ల్యాబ్ అందుబాటులోకి రానుంది. దీనికి రూ.10 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ ల్యాబ్‌లో అన్నీ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్య పరికరాలుంటాయి. ఇందులో ఆయా కార్పొరేట్ ఆస్పత్రులకు సంబంధించిన రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఇప్పటికే కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులకు సొంతంగా ల్యాబ్‌లున్నాయి. అయితే వాటిలో పూర్తి స్థాయి పరికరాలు లేవు.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగినవీ లేవు. ఈ నేపథ్యంలో విశాఖ హెల్త్ సిటీలో కామన్ లేబొరేటరీ అవసరాన్ని గుర్తించారు. ఇప్పుడు హెల్త్ టూరిజంలో భాగంగా ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే హెల్త్ సిటీలో మధుర బృందావన్ ఆస్పత్రికి చెందిన భవనం నిర్మాణం పూర్తయి ఉంది. ఈ భవనంలో 15 వేల చదరపు అడుగుల స్థలంలో ఈ ల్యాబ్‌కు రూపకల్పన చేస్తారు. ఈ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కామన్ ల్యాబ్ ఏర్పాటుకు అవసరమైన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) సిద్ధమవుతోంది. దీనిని జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు పరిశీలన చేయనున్నారు.

ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్

ఈ హెల్త్ సిటీలో రెండు క్లస్టర్లను గుర్తించారు. ఇందులో ఒకటి స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సిడ్బీ) ఆధ్వర్యంలో కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఈటీపీ) కాగా.. రెండవది కామన్ లేబొరేటరీ. ఈ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. దీనికి ఒక ఎకరం స్థలం అవసరమవుతుంది. ఈ స్థలాన్ని ఏపీఐఐసీ కేటాయించాల్సి ఉందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సిహెచ్.గణపతి 'సాక్షి'కి చెప్పారు. హెల్త్ సిటీలో సుమారు 30 కార్పొరేట్ ఆస్పత్రులకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాదు.. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి కూడా రోగులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఇన్నాళ్లూ హెల్త్ సిటీ ఆస్పత్రుల యాజమాన్యాలు మెడికల్ వ్యర్థాలను ఇష్టానుసారంగా ఎక్కడబడితే అక్కడ విడిచి పెడుతున్నాయి. దీనివల్ల ఎన్నో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ హెల్త్ సిటీలో ఆయా ఆస్పత్రులకు చెందిన 18 పైప్‌లైన్లు ఉన్నాయి. ఇకపై ఈ అత్యాధునిక ఎఫ్లుయెంట్ ప్లాంట్ అందుబాటులోకి వస్తే కొత్త టెక్నాలజీతో ఈ మెడికల్ వ్యర్థాలను ట్రీట్‌మెంట్ చేసేందుకు వీలవుతుంది. దీంతో ఇకపై మెడికల్ వ్యర్థాల నిర్వహణ బెడద తప్పుతుంది.



కామన్ ల్యాబ్ (ఫైల్)

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు ఎనలేనివి

దాబాగార్డెన్స్ : భారతదేశానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు ఎనలేనివని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ వైఎస్సార్‌సీపీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు, పలువురు జీవీఎంసీ అధికారులు పూలమాలలు వేసి ఆజాద్‌కు నివాళులర్పించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత ప్రభుత్వ ప్రథమ విద్యా శాఖ మంత్రిగా పని చేశారని, ఆయన అసలు పేరు మొహియుద్దీన్ అహ్మద్ అన్నారు. అబుల్ కలాం అనేది ఆయనకున్న బిరుదు అని పేర్కొన్నారు. ఆజాద్ స్ఫూర్తిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించే విధంగా కార్యాచరణ అమలు చేస్తున్నారన్నారు. అనంతరం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జీవీఎంసీలో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు పి.రవికృష్ణరాజు, అదనపు కమిషనర్లు డాక్టర్ వై. శ్రీనివాసరావు, ఎస్ఎస్ వర్మ, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్, ఫ్లోర్‌లీడర్ తదితరులు

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో..

గ్రూప్–1, 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- నవంబర్ 19వ తేదీన విశాఖపట్నంలో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు గ్రూప్-1,2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్-1,2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్-1,2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్(www.sakshieducation.com)ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత : ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గ్రూప్1, గ్రూప్ 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్1, 2 పరీక్షలపై అవగాహన కల్పించడంతోపాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8977625795 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సాప్‌లో పంపగలరు.

ముఖ్య సమాచారం:

అవగాహన సదస్సు తేదీ:
నవంబర్ 19, 2023(ఆదివారం)

వేదిక:
డా. బి.ఆర్.అంబేద్కర్ భవన్, రీజనల్ కంటి ఆస్పత్రి ఎదురుగా, రామా టాకీస్ దగ్గర, శ్రీనగర్, విశాఖపట్నం.

సమయం:
ఉదయం 09.30 నుంచి 12.30 వరకు

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 8977625795

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	540.00
విజయనగరం	544.00
శ్రీకాకుళం	544.00

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.102
స్కిన్	: రూ.174
స్కిన్‌లెస్	: రూ.184

నగరాలను బీసీ-డీలో చేర్చడం హర్షణీయం

రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత



సీఎం జగన్ చిత్రటానికి క్షీరాభిషేకం చేస్తున్న నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కళింగ వైశ్య డైరెక్టర్లు

కొమ్మాది: రాష్ట్రంలోని నగరాల కులస్తులను బీసీ-'డి'లో చేర్చడం హర్షణీయమని రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి నగరాల కులస్తుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. ఎండాడలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఉత్తరాంధ్రలోని నగరాలను బీసీలుగా చేస్తే.. ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 26 జిల్లాల్లోని నగరాలను బీసీ-డీలో చేరుస్తూ జీవో విడుదల చేశారన్నారు. తమ ప్రాణమున్నంత వరకూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంటే ఉంటామన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకుంటేనే రాష్ట్రంలో ఉన్న పేద, బడుగు బలహీన వర్గాల వారికి మేలు జరుగుతుందన్నారు. కోలా గురువులు మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హతే ప్రామాణికంగా అందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి రవిరెడ్డి, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్లు కోరికాన మోహన్ రావు, వాండ్రాసి శ్యామల, గుజ్జారి లలిత, నాగోతి పార్వతి, బాయన మీనా, పార్టీ నాయకులు పెంట్ర అప్పన్న పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కళింగ వైశ్య, కళింగ కోమటి సామాజిక వర్గాలను బీసీ-డీగా పరిగణిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాలకు వర్తింపజేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ మేరకు ఎండాడలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ సకలాభక్తుల ప్రసాదరావు, పొట్నూరు మాధవీ మధుసూదనరావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ కళింగ వైశ్య, కళింగ కోమటి సామాజికవర్గీయులు సీఎం జగన్‌కు రుణపడి ఉంటారన్నారు. పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా గౌరవ అధ్యక్షుడు పెంటా చంద్రభూషణరావు, కంచరపాలెం సంఘం అధ్యక్షుడు విశ్వేశ్వరరావు, నారాయణగుప్త తదితరులు పాల్గొన్నారు.

తాటిపూడి పైప్‌లైన్ లీక్



ఇంట్లోకి వచ్చేసిన నీరు

గోపాలపట్నం: తాటిపూడి పైప్‌లైన్ శుక్రవారం రాత్రి మళ్లీ పగిలిపోయింది. అధిక మొత్తంలో మంచి నీరు వృథా అయింది. గోపాలపట్నం బంక్ వద్ద ఈ పరిస్థితి ఏర్పడింది. ఇదే ప్రాంతంలో ఏడాదికి రెండుమార్లు పైప్‌లైన్లు పగిలిపోయి గ్యాలన్ల నీరు వృథా అవుతోందని స్థానికులు వాపోతున్నారు. పైపులైన్లపై రెండేసి అంతస్తుల్లో దుకాణాలు నిర్మించడంతో, పైపులైన్‌పై ఒత్తిడి పెరిగి పగిలిపోతున్నాయని చెబుతున్నారు. పైపులైన్లపై ఉన్న దుకాణాలను తొలగించకుంటే, తరచూ ఇదే పరిస్థితి తలెత్తే అవకాశం ఉందని, అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఎస్జీఎఫ్ ఏపీ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

సత్తాచాటిన విశాఖ, అనంతపురం క్రీడాకారులు

విశాఖ స్పోర్ట్స్: పాఠశాలల క్రీడా సమాఖ్య జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు బాల ప్రణయ్, అపర్ణ, మురారి, నక్షత ఎంపికయ్యారు. అండర్ 14 బాల బాలికల రెండింటా అనంతపురం క్రీడాకారులు, అండర్ 17లో విశాఖ క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచారు. విశాఖ స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు అండర్ 14,17 బాల బాలికల విభాగాల్లో ఎంపిక బ్యాడ్మింటన్ పోటీలను టీమ్, వ్యక్తిగత అంశాల్లో విశాఖ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏపీలోని 13 ఉమ్మడి జిల్లాల జట్లు ఈ సెలక్షన్స్‌లో పాల్గొన్నాయి. టీమ్‌లో సింగిల్స్, రివర్స్ సింగిల్స్‌తో పాటు డబుల్స్ పోటీలు జరగ్గా, వ్యక్తిగత విభాగం సింగిల్స్‌లో సత్తాచాటిన వారిని రాష్ట్ర ఎస్జీఎఫ్ జట్టుగా ఐదుగురేసి చిన్నారులను ఎంపిక చేశారు. అండర్ 14 బాలురలో ఎస్.మురారి వెంకట్ (అనంతపురం), ఎం.కృష్ణకార్తీక్ (తూర్పుగోదావరి), జి.సాయివేదవ్యాస్ (చిత్తూరు), కే.ఈశ్వర్‌సాయి(అనంతపురం), ఎస్.హేమంత్‌శ్రీ (పశ్చిమగోదావరి)ఎంపిక కాగా నానిబాబు, యజ్ఞదత్, సుహాస్ స్టాండ్‌బైగా నిలిచారు. బాలికల్లో జె.నక్షత్ర (అనంతపురం), ఆర్ యశ్వితసాయి (కృష్ణ), డీవీ యజ్ఞశ్రీ (అనంతపురం), డి.ఆశాశ్రీ (ప్రకాశం), సీహెచ్ మోక్షజ్ఞ (శ్రీకాకుళం) ఎంపికయ్యారు. మనోజ్ఞ, బృందవాణి, శేష్మక స్టాండ్‌బైగా నిలిచారు. అండర్17 బాలురలో బాలప్రణయ్ (విశాఖ), టి.నిఖిల్ ప్రకాష్(కర్నూలు), ఎ.త్రిలోక్ (పశ్చిమగోదావరి), కేఎస్ వెంకటప్రణీత్ (తూర్పుగోదావరి) ఎంపిక కాగా బాలికల్లో అపర్ణ (విశాఖ), సీహెచ్ భవితశ్రీ(పశ్చిమగోదావరి), ఎన్.సౌమ్యశ్రీ, (తూర్పుగోదావరి), బి.హర్షిత (విశాఖ) జట్టుకు ఆడనున్నారు. వీరంతా ఏపీ తరఫున అండర్ 14,17 బాల బాలికల విభాగాల్లో పోటీపడనున్నారు.

కనులపండువగా ఎకో ఫ్రెండ్లీ-గ్రీన్ దీపావళి



విద్యార్థులతో దీపావళి వేడుకల్లో పాల్గొన్న సన్ ఇన్‌స్టిట్యూట్ ఈడీ ఆశా జాస్తి

తాటిచెట్లపాలెం : సన్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు, సిబ్బందితో కలిసి ఎకో ఫ్రెండ్లీ- గ్రీన్ దీపావళి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా జాస్తి మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను తమ విద్యార్థులు అర్థం చేసుకుని అనుసరించేలా మన పండగలు, పూజలను సంస్థలో ప్రతి సంవత్సరం విద్యార్థులతో కలిసి నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సంప్రదాయ వస్త్రధారణ, నృత్యాలతో విద్యార్థులు, సిబ్బంది అబ్బురపరిచారు.

రెప్కో బ్యాంక్ ఆకర్షణీయ పథకాలు

తాటిచెట్లపాలెం : భారత ప్రభుత్వ సంస్థ రెప్కో బ్యాంక్ దీపావళి సందర్భంగా తమ ఖాతాదారులకు పలు ప్రత్యేక పథకాలను ప్రకటించింది. ఈ మేరకు ఎస్ఏడీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ జె. రవి ఒక ప్రకటన ద్వారా వివరాలు తెలిపారు. దీపావళిని పురస్కరించుకుని 'రెప్కో 400', చిన్నారుల కోసం 3-5 సంవత్సరాల వ్యవధి గల పథకాలలో పెట్టుబడి పెట్టి ఆకర్షణీయ, అత్యధిక వడ్డీ పొందగలరని తెలియజేశారు. మరిన్ని వివరాలకు శాంతినగర్‌లో గల బ్రాంచిలో స్వయంగా లేదా 0891-2702641/9490737965 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

బాలురు, బాలికల విభాగాల్లో విశాఖ, గుంటూరు జట్లు విజేతలు



ప్రథమ స్థానంలో నిలిచిన విశాఖ బాలుర జట్టు

అరకులోయ టౌన్ : ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కంఠబౌంషుగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అండర్-14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు శనివారంతో ముగిశాయి. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో విశాఖపట్నం జట్టు, ద్వితీయస్థానంలో చిత్తూరు జట్టు, తృతీయస్థానంలో శ్రీకాకుళం జట్టు నిలిచింది. బాలికల విభాగంలో ప్రథమస్థానంలో గుంటూరు జట్టు , ద్వితీయ స్థానంలో విశాఖపట్నం జట్టు, తృతీయ స్థానంలో పశ్చిమ గోదావరి జట్టు నిలిచాయి. విజేతలకు ఇన్‌చార్జీ డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు పతకాలు, ధ్రువపత్రాలు, షీల్డులు అందజేశారు. మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి 26 జట్లు పాల్గొన్నాయి.